సాక్షి జగిత్యాల

గురువారం । 27 । ఏప్రిల్ । 2023



ఆకట్టుకున్న శివపురాణం

జగిత్యాల: వేదపండితుడు తిగుళ్ల విష్ణుశర్మ చదివి వినిపించిన శివపురాణం మహిళా భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.



పుట్టగొడుగుల్లా ఆస్పత్రులు

జగిత్యాల: జిల్లాలో వైద్యం వ్యాపారంగా మారింది. పెట్టుబడిదారులు ఎక్కడపడితే అక్కడ ఆస్పత్రులు నెలకొల్పుతున్నారు. - 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి స్పందన



మాట్లాడుతున్న లక్ష్మీప్రసూన

కోరుట్ల: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మీప్రసూన బుధవారం చేపట్టిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి స్పందన లభించింది. సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం చేపట్టారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, ప్రయాణికులు పలు సమస్యలను డీఎం దృష్టికి తీసుకొచ్చారు. రాయికల్ పట్టణం నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సు నడపాలని పలువురు కోరారు. రాయికల్ నుంచి నిర్మల్‌కు కూడా బస్సు నడపాలని మరికొందరు విజ్ఞప్తి చేశారు. సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని డీఎం వారికి సమాధానం చెప్పారు. అదేవిధంగా పలు చిన్న సమస్యలను ఫోన్ ద్వారా పరిష్కరించామని డీఎం వివరించారు.

'ప్రారంభానికే పరిమితమా?'



ధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్(జగిత్యాల): రాష్ట్రప్రభుత్వం ప్రతీ పథకాన్ని ఆర్భాటంగా ప్రారంభించినా.. పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమవుతోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. బట్టపల్లి, సారంగాపూర్, నాయకపుగూడంలోని కొనుగోలు కేంద్రాల్లో వర్షాలకు తడిసిన ధాన్యం, నేలవాలిన పంటలను ఆయన బుధవారం పరిశీలించాక విలేకరులతో మాట్లాడారు. దళితబంధు కోసం రూ.17,700 కోట్లు కేటాయించి ఏడాది పూర్తయినా అందరు దళితులకు రూ.10లక్షల సాయం చేయలేదన్నారు. వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల పరిహారం చెల్లిస్తామని చెప్పినా నేటికీ ఇవ్వలేదన్నారు. గృహలక్ష్మి పథకం కోసం రూ.3.50 లక్షలు ఇంకా ఇవడంలేదని దుయ్యబట్టారు. నాయకులు కోండ్ర రాంచంద్రారెడ్డి, కొక్కు గంగారాం, కట్ట ఆదర్శ్, కాలగిరి మధుసూదన్, చీటి రమణారావు, నలువాల వెంకన్న, గడ్డం మల్లారెడ్డి, మల్లారెడ్డి ఉన్నారు.

రైతులు అధైర్యపడొద్దు

కోరుట్ల: అకాల వర్షాలతో రైతులు అధైర్యపడొద్దని రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావ్ అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాలు, వడగళ్లతో పొట్టదశలోని వరి పంట నేలమట్టమైందని, కల్లాల్లోని ధాన్యం తడిసిందని తెలిపారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు.. పంటనష్టం వివరాలు సేకరించాలని ఇప్పటికే జిల్లా వ్యవసాయ అధికారులకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. మామిడి నష్టపోయిన రైతుల వివరాలు సేకరిస్తున్నారన్నారు. వివరాల సేకరణ పూర్తయ్యాక బాధిత రైతులకు పరిహారం అందిస్తామని అభయం ఇచ్చారు. ఐకేపీ, మార్కెట్‌యార్డుల్లో ప్రతిధాన్యం పు గింజ కొనుగోలు చేస్తామని తెలిపారు. ఎంపీపీ తోట నారాయణ, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు రాజేశ్, అనిల్ ఉన్నారు.

'రైతుల ప్రాణాలు పట్టవా?'



రైతులతో మాట్లాడుతున్న విజయలక్ష్మి

జగిత్యాల: అకాల వర్షాలు, వడగళ్ల బీభత్సంతో రైతులు ప్రాణాలుపోయే స్థితిలో ఉంటే బీఆర్ఎస్ ప్లీనరీ వేడుకలు నిర్వహించడం సిగ్గుచేటని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మార్కెట్ యార్డును బుధవారం ఆమె సందర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతులను ఆదుకుంటామని, ఎకరాకి రూ.10 వేల పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చినా ఒక్కరూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. నాయకులు దేవేందర్ రెడ్డి, సరిత, రమేశ్‌రావు, రజిత పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి ఇద్దరు నాయకుల సస్పెన్షన్

జగిత్యాల: కాంగ్రెస్ పార్టీ నుంచి ఇద్దరు నాయకులను సస్పెండ్ చేసినట్లు డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై కోరుట్లకు చెందిన ఎండీ నజీర్, ఎర్ల నవీన్ తప్పుడు ప్రచారం చేస్తూ, పార్టీకి నష్టం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. అందుకే వీరిని పార్టీ నుంచి తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

- 'ఫిబ్రవరిలో తీగలగుట్టపల్లిలోని ఓ షాపునకు వెళ్లే లోడు మందులో నీళ్ల కలిపారన్న సమాచారంతో ఎక్సైజ్ అధికారులు దాడి చేశారు. ఈ దాడిలో నీళ్ల కలిపిన మందుబాటిళ్లు పట్టుబడ్డాయి. పరీక్షల్లో మద్యంలో నీళ్ల కలిపారని తేలింది. వాస్తవానికి షాపు యజమానికి ఈ వ్యవహారంతో సంబంధం లేదు. మార్గమధ్యలో డ్రైవర్లు, సిబ్బంది కలిసి కల్తీకి పాల్పడ్డారని అధికారులు గుర్తించారు. అయినా.. సరుకు షాపులో దొరికింది కాబట్టి దీనిపై కేసు నమోదు చేసిన ఎక్సైజ్ పోలీసులు, యజమానికి జరిమానా కూడా విధించారు.

- గతవారం కరీంనగర్‌లో ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. ఐఎంఎల్ డిపో నుంచి గంగాధరకు బయల్దేరిన వాహనం మానేరు డ్యాం కట్ట సమీపంలో నీళ్ల కలుపుతుండగా.. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఈ విషయంలో ఆఫీసర్ల కంటే రెండాకులు ఎక్కువే చదివిన డ్రైవర్.. వెంటనే సరుకు వారి చేతికి చిక్కకుండా సీసాలన్నీ రోడ్డు మీదే పగులగొట్టాడు. చేసేది లేక వాహనాన్ని మాత్రమే సీజ్ చేసి ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. ఈ వ్యవహారంలో కేసు నమోదు కాలేదని తెలిసింది.

- తరచుగా తీగలగుట్టపల్లిలోని బెల్టుషాపులో మందు తాగే ఓ వ్యక్తికి రుచిలో తేడా వచ్చింది. ఇదేంటి? తాను తాగిన మందు ఎక్కడం లేదని షాపు నిర్వాహకులతో గొడవకు దిగాడు. తమకేం సంబంధం లేదని.. వచ్చిన సరుకును అమ్ముతున్నామని బెల్టుషాపు నిర్వాహకుడు చెప్పాడు. సిరిసిల్ల, సుల్తానాబాద్, పెద్దపల్లి, జగిత్యాల, గంగాధర మండలంలో తాము కొన్న మందు పలుచగా ఉందని కొందరు మందుబాబులు తరచుగా ఫిర్యాదులు చేస్తున్నారు. మొత్తానికి తాము తాగే మందు గతంలోలా కిక్కు ఇవ్వడం లేదన్నది వారి వాదన. ఒకరిద్దరు అంటే ఏమో అనుకోవచ్చు కానీ, పదే పదే మందుబాబులు ఇదే ఫిర్యాదు రావడం వెనక ఏం జరుగుతోంది? అన్న విషయంపై 'సాక్షి' పరిశోధనలో పలు ఆసక్తికర విషయాలు తెలిశాయి.

కిక్కివ్వని మందు

వైన్‌షాపుల సరుకు దారిదోపిడీ చేస్తున్న డ్రైవర్లు

- లోడుకు 15 వరకు ఫుల్‌బాటిళ్లు నీళ్లతో కల్తీ
- వినియోగదారులు తాగేది నీళ్ల మందేనా?
- కిక్కు రాక పరేషాన్ అవుతున్న మద్యంప్రియులు
- ఉమ్మడి జిల్లాలో తూతూ మంత్రంగా నౌకర్‌నమా!
- లోడుకు రూ.10 వేల చొప్పున రూ.లక్షన్నర వరకు స్వాహా
- మొత్తం విలువ ఏడాదికి రూ.5 కోట్ల పైమాటే..!





మద్యం కల్తీ చేస్తున్న డ్రైవర్(ఫైల్), కరీంనగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో పట్టుబడ్డ వాహనం(ఫైల్)



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ ఐఎంఎల్ డిపో నుంచి దాదాపుగా ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల వైన్‌షాపులకు మందు సరఫరా జరుగుతుంటుంది. ఈ డిపో నుంచి రోజుకు 20 నుంచి 30 వరకు సరుకు లోడ్లు వెళ్తుంటాయి. సరుకును క్షేమంగా షాపుల్లోకి చేర్చాల్సిన కొందరు వాహనాల డ్రైవర్లు, సహాయకులు, సరుకు దించే వారు కుమ్మక్కవుతున్నారు. వాహనాన్ని ఏదైనా నిర్మానుష్య ప్రాంతంలో నిలిపివేసి ఎవరూ చూడకుండా సీల్ చెదరకుండా ఫుల్ బాటిల్ (750 ఎంఎల్ నుంచి 1000 ఎంఎల్) ఓపెన్ చేసి అందులో క్వార్టర్ (180ఎంఎల్ నుంచి 200 ఎంఎల్) వరకు మందును వేరే బాటిళ్లలో నింపుతున్నారు. అనంతరం తిరిగి సీల్ వేసి షాపులకు వెళ్లాల్సిన సరుకులో కలుపుతున్నారు. వాటిని అప్పటికే సిద్ధం చేసిన అవే బ్రాండు బాటిళ్లలో నింపి, బెల్టు షాపులకు ఎంతో కొంతకు విక్రయిస్తున్నారు. అక్కడ వాళ్లు ఇంకొన్ని నీళ్ల కలిపి రాత్రీ పగలు తేడా లేకుండా అమ్ముతున్నారు. ఈ లెక్కన మార్గ మధ్యంలో, కొన్ని వైన్‌షాపుల్లో, దాదాపుగా అన్ని బెల్టుషాపుల్లో మద్యంలో నీళ్ల కలుపుతున్నారు. ఇది తెలియని వినియోగదారులు ఎంత తాగినా తమకు కిక్కు రావడం లేదని నెత్తీనోరు బాదుకుంటున్నారు. ఈ విషయంలో ఎక్సైజ్ డిపార్ట్‌మెంటుకు పలు ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయి. దీంతో ఎక్సైజ్ శాఖ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి దీనిపై కొన్ని నెలలుగా నిఘా ఏర్పాటు చేసింది.

సరిగా అమలుకాని నౌకర్ నమా..!

వాస్తవానికి ఐఎంఎల్ డిపో.. తమకు వచ్చిన ఆర్డర్ పరంగా సరుకును వాహనాల్లోకి ఎక్కిస్తారు. అంత వరకు వీరి బాధ్యత. తరువాత మద్యం కల్తీ జరిగే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఎక్సైజ్‌శాఖ చాలా కాలంగా నౌకర్‌నుమాను ప్రవేశపెట్టింది. అంటే సరుకును షాపు వరకు తీసుకువచ్చేందుకు ప్రతీ షాపు నుంచి ముగ్గురు సిబ్బందికి ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక అనుమతి ఇస్తుంది. సరుకు ఐఎంఎల్ డిపో నుంచి వైన్‌షాపు చేరేవరకు వీరిదే పూర్తి బాధ్యత. కానీ.. ఉమ్మడి జిల్లాలో ఈ విధానం సరిగా అమలు కావడం లేదు. వైన్‌షాపు యజమానుల్లో చాలామంది తాము ఎంపిక చేసిన నౌకర్ నమాలను వాహనంతోపాటు పంపడంలో నిర్లక్ష్యం చూపిస్తున్నారు. దీంతో మార్గమధ్యలో వాహనంలో ఉన్న సిబ్బంది నీళ్ల కలిపిన మందును షాపులకు, బెల్టుషాపులకు చేరవేస్తున్నారు.

రోజుకు రూ.లక్షపైగానే సరుకు స్వాహా!

ప్రతిరోజూ ఎంతలేదన్నా.. 20 నుంచి 30 వరకు సరుకు వాహనాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సరకు డెలివరీ చేస్తాయి. డ్రైవర్లు తలచుకుంటే.. ప్రతీ లోడుకు 15 నుంచి 20 బాటిళ్లు, ప్రతీ ట్రిప్పుకు కల్తీ చేసే అవకాశం ఉంటుంది. సగం లోడు వాహనాల్లో కల్తీ జరిగినా.. ఈ లెక్కన రోజుకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు సరకు కల్తీ అవుతోందన్నది ఎక్సైజ్ వర్గాల సమాచారం. ఇది నెలకు రూ.45 లక్షలుగా, ఏడాదికి దాదాపుగా రూ.కోటి నుంచి రూ.5.40 కోట్లకుపైగా సరుకును స్వాహా చేస్తున్నారని ఓ ఎక్సైజ్ అధికారి అభిప్రాయపడ్డారు.

నవరాత్రోత్సవాలు ప్రారంభం



గోదావరి నది నుంచి నృసింహుని ఆలయానికి బిందెలో గంగాజలం తీసుకొస్తున్న అర్చకులు

- ముస్తాబైన లక్ష్మీనృసింహుడు
- మే 5వ తేదీ వరకు వేడుకలు
- భారీగా తరలివస్తున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

బుగ్గారం(ధర్మపురి): జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి నవరాత్రోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత పట్టణ సమీపంలోని గోదావరి నదికి ఉదయం 5.30గంటలకు తరలివెళ్లిన అర్చకులు.. మేళతాళాలతో గంగాజలాన్ని బిందెలో తీసుకుని ఆలయానికి చేరుకున్నారు. ఆ తర్వాత ఉదయం 6.30 గంటలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం వేదోక్తంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వచ్చేనెల 4వ తేదీవరకు వేడుకలు జరుగుతాయని ఆలయ అధికారులు తెలిపారు.

భారీగా తరలివస్తున్న భక్తులు..

ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి నవరాత్రోత్సవాలకు హాజరయ్యేందుకు వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు. తొలిరోజు వందల సంఖ్యలో తరలివచ్చిన భక్తులు తొలుత పట్టణ సమీప గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. ఆ తర్వాత నృసింహుని ఆలయానికి చేరుకున్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, ఆలయ ఈవో శ్రీనివాస్, రెనోవేషన్ కమిటీ చైర్మన్ ఇందా రపు రామయ్య, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, వేదపండితులు బొజ్జ రమేశ్ శర్మ, ముత్యాలశర్మ పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలు తీయడానికే ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు

- పాశిగామ గ్రామస్తుల ఆగ్రహం
- ఆత్మహత్యకు యత్నించిన ఇద్దరు గ్రామస్తులు



లారీ ఎదుట బైఠాయించిన గ్రామస్తులు

వెల్గటూర్(ధర్మపురి): ప్రజల ప్రాణాలు తీయడానికే ఇథనాల్ రైస్ బ్రాన్ ఆయిల్ పరిశ్రమ నిర్మిస్తున్నారని పాశిగామ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపాదిత స్థలంతో బుధవారం జేసీబీ సాయంతో కర్మాగారం పనులు ప్రారంభించేందుకు యత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. సుమారు 4 గంటలపాటు ధర్నా నిర్వహించారు. పోలీసులు నచ్చజెప్పినా వినలేదు. గోపతి మల్లయ్య జేసీబీ తీసుకొచ్చిన లారీకి తాడుతో ఉరిపోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఎస్సై నరేశ్ కుమార్ అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది. నలిమెల సత్తవ్వ తనచేతిలో టవల్‌తో ఉరివేసుకునేందుకు యత్నించి సొమ్మసిల్లి పడిపోయింది. పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. భారీసంఖ్యలో ప్రజలు ఆందోళనలు చేస్తున్నా.. రైతులను రెచ్చగొట్టడానికే ప్రభుత్వం ఫ్యాక్టరీ పనులు ప్రారంభిస్తోందని గ్రామస్తులు ధ్వజమెత్తారు. పరిశ్రమను రద్దు చేయకుంటే మూకుమ్మడి ఆత్మహత్యలు చేసుకుంటామని వారు హెచ్చరించారు. సామాజిక కార్యకర్త మోతె నరేశ్ ఆందోళనకారులకు మద్దతు తెలిపారు. జేసీబీని వెనక్కి పంపిస్తానని ఎస్సై హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించుతాం

- సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి




మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

గొల్లపల్లి: ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తూ, కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించి, దేశాన్ని రక్షించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి కోరారు. 'పల్లెపల్లెకు సీపీఐ.. ప్రజల వద్దకు సీపీఐ' జనచైతన్యయాత్ర బుధవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగాన్ని అమలు చేయడం లేదని విమర్శించారు. కార్మిక వ్యతిరేక వైఖరి అవలంబిస్తున్నాయని ధ్వజమెత్తారు. ప్రజా సంక్షేమం, దేశాభివృద్ధి కంటే రాబడిపైనే ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచిపెడుతున్నాయని ఆరోపించారు. కేంద్రప్రభుత్వం ఇంకో అడుగు ముందుకేసి నిత్యావసరాలు, పెట్రోల్, డీజిల్ ధరలను అమాంతం పెంచేసి సామాన్యుల నడ్డి విరిచిందని మండిపడ్డారు. కార్పొరేట్ సంస్థల కొమ్ముకాస్తున్న బీజేపీ సర్కార్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు. అంతకు ముందు నల్లగుట్ట వద్ద ప్రజాచైతన్య యాత్రకు డప్పుచప్పుళ్లతో ఘనస్వాగతం పలికారు. అనంతరం నల్లగుట్ట నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి గుంటి వేణు, జగిత్యాల జిల్లా కార్యదర్శి వెన్న సురేశ్, నాయకులు శ్రీగడ దేవదాసు, కోరుకంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'రైతులపై చిత్తశుద్ధిలేదు'

రాయికల్(జగిత్యాల): ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి రైతులపై చిత్తశుద్ధి లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి విమర్శించారు. కిష్టంపేట, కుమ్మరిపల్లి, కొత్తపేటలో వర్షాలకు నష్టపోయిన వరి, నువ్వు పంటలను బుధవారం ఆమె పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నదాతలపై కపట ప్రేమ చూపుతున్నారని, ఆర్థిక సాయం అందించడంలో ఎవరూ ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. ఎంపీ అర్వింద్ రైతులను ఆదుకోవాలని కలెక్టర్‌కు విన్నవించారని తెలిపారు. నాయకులు పడాల తిరుపతి, ఉడుత రాంసురేశ్, ఉడుత రవీందర్, సురేశ్, రాజశేఖర్, పాలడుగు రవీందర్, శేఖర్, అనిల్, రాజేందర్, గంగాధర్, వేణు పాల్గొన్నారు.



వరి పంట పరిశీలిస్తున్న భోగ శ్రావణి

ఫసల్ బీమా వద్దన్నరు కదా..?

సారంగాపూర్(జగిత్యాల): కేంద్రప్రభుత్వం ఫసల్ బీమా ప్రవేశపెడితే రాష్ట్రప్రభుత్వం వ్యతిరేకించిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి విమర్శించారు. బీర్‌పూర్ మండలంలో వర్షాలు, వడగళ్లతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఫసల్ బీమా అమలు చేసిఉంటే ప్రస్తుతం పంటలు నష్టపోయిన రైతులు పరిహారం అంది ఉండేదని తెలిపారు.

ప్రజాసమస్యలపై పట్టింపు లేదా?

- ఆగ్రహం వ్యక్తం చేసిన సభ్యులు
- గరంగరంగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, వేదికపై అదనపు కలెక్టర మకరంద్, జెడ్పీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాలజోన్: ప్రజాసమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని జెడ్పీ పాలకవర్గ సభ్యులు మండిపడ్డారు. స్థానిక జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అధ్యక్షతన జరిగింది. మంత్రి కొప్పుల ఈశ్వర్, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎవరేమన్నారంటే..

రైతులను ఆదుకుంటాం

- అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని, వ్యవసాయాధికారులు పంట నష్టంపై అంచనాలు రూపొందిస్తున్నారని, ఎవరూ ఆందోళన చెందవద్దని మంత్రి కొప్పుల ఈశ్వర్ అభయం ఇచ్చారు. రైస్‌మిల్లర్లు రైతులను ఇబ్బందులు పెట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వైకల్యం గుర్తించి దివ్యాంగులకు సర్టిఫికెట్లు జారీచేయాలని మంత్రి కొప్పుల వైద్యులను ఆదేశించారు.

ప్రతిపక్షాల అనవసర ఆరోపణలు

- గత ప్రభుత్వాలు చేయని పనులు ఈ ప్రభుత్వం చేస్తోందని, అయినా, అనవసర ఆరోపణలు చేస్తున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. ప్రకృతి వనాలను మరింత అందంగా తీర్చిదిద్దేందుకు అటవీశాఖ అధికారులు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. విద్యాశాఖ ప్రగతి పనులు కాపీ, పేస్ట్‌లా ఉన్నాయని ధ్వజమెత్తారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే ఎస్సారెస్పీ కాలువలు మరమ్మతు చేయాలని, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కోరారు. మహిళా గ్రూపులకు వడ్డీలేని రుణాలు రాలేదని విద్యాసాగర్‌రావు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

జెడ్పీటీసీలు ఏమన్నారంటే..

- చెరువుల్లో ఏటా చిన్నచేపపిల్లలు వదులుతున్నారని, తద్వారా మత్స్యకారులకు పెద్దగా ఉపయోగం లేదని, కొడిమ్యాలలో కురిసిన వడగళ్లతో ధాన్యం వర్షపు నీటిలో కొట్టుకుపోయిన రైతులను ఆదుకోవాలని ప్రశాంతి అన్నారు. రాయికల్ మండలంలోని చివరి ఆయకట్టు దావన్‌పల్లి, కట్కాపూర్ గ్రామాలకు సాగునీరు అందడంలేదని అశ్విని తెలిపారు. రాళ్లవాగు ద్వారా కథలాపూర్ మండలానికి నీరు రావడం లేదని, కథలాపూర్ మండలం కలికోటలో వడగళ్లవానతో నష్టం జరిగినా అధికారులు నివేదికలు తయారు చేయలేదని, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో పరిశుభ్రత లేదని భూమయ్య ఆరోపించారు. కొండగట్టుకు తాగునీరు అందించేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ఎక్కడి వరకు వచ్చాయని రామ్మోహన్‌రావు ప్రశ్నించారు. మన ఊరు–మన బడి కింద ఎన్ని పాఠశాలలు ఎంపికయ్యాయని, ఎన్నింటిలో పనులు జరుగుతున్నాయని రాజేందర్‌రావు అధికారులను ప్రశ్నించారు.

ఎంపీపీలు ఇలా మాట్లాడారు..

- బుగ్గారం మండలంలో ఎస్సారెస్పీ కాలువకు సిమెంట్ లైనింగ్ పనులు చేయాలని రాజేందర్, జగిత్యాల రూరల్ మండలం గుల్లపేట చెక్‌డ్యాం ఇరువైపులా కోతకు గురైందని రాజేంద్రప్రసాద్, అవసరం లేకున్నా బ్యాంకర్లు మహిళలకు రుణాలు ఇచ్చి అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నారని సాయిరెడ్డి సభ దృష్టికి తెచ్చారు. బడిపిల్ల యూనిఫారమ్స్ కుట్టే పనిని ధర్మపురి కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన వారికి ఇవ్వాలని మహేశ్, కొడిమ్యాలలో చేపట్టిన మన ఊరు–మన బడి పనుల్లో నాణ్యత లోపించిందని మేన్నెని స్వర్ణలత, కరెంట్ మీటరు కోసం ఒక కిలో వాట్ కావాలంటే రెండు కిలోవాట్లకు డీడీలు కట్టించుకున్నారని, బీర్‌పూర్ మండలంలోని చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని రమేశ్ అన్నారు. సదరం శిబిరాల్లో మానవత దృక్పథం లోపించిందని డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అధికారులపై ఆరోపలు చేశారు.

జెడ్పీ సభ్యుల ఏకగ్రీవ తీర్మానాలు ఇవీ..

- చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, పార్లమెంట్ భవనానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టాలని తీర్మానించారు. మహిళా రిజర్వేషన్లపై అదనపు కలెక్టర్ మకరంద్‌కు వినతిపత్రం అందజేయాలని కోరారు. అదనపు కలెక్టర్ మకరంద్, జెడ్పీ సీఈవో రామానుజాచారి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

జగిత్యాల రూరల్ : గ్రామపంచాయతీల్లో జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా మూడేళ్ల పనిచేశామని, తమను క్రమబద్ధీకరించాలని కోరారు.

వినతిపత్రం అందజేత



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్‌లు

జగిత్యాల రూరల్: తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ సర్పంచులు బుధవారం మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడునెలల నుంచి గ్రామ పంచాయతీలకు కేంద్రం, రాష్ట్రం నిధులు రావడం లేదని, సర్పంచ్‌లు గ్రామాభివృద్ధికి సొంత డబ్బులు ఖర్చు చేస్తున్నారన్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపులో సీసీచార్జీలు, గ్రామపంచాయతీ సొంత నిధుల నుంచి చెల్లింపులు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో చేసిన పనులకు కూడా ఎంబీ రికార్డు అయినప్పటికీ, చెక్కులు వేసినా డబ్బులు రావడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే మంజూరు చేసేలా చొరవ చూపాలని కోరారు. సర్పంచులు జక్కుల తిరుపతి, లక్ష్మణ్‌రావు, గంగాధర్, ప్రభాకర్, స్వప్న, దామోదర్, సరోజన పాల్గొన్నారు.

నృసింహుడి ఆలయంలో 'అడ్లూరి' పూజలు



మొక్కులు చెల్లించుకుంటున్న అడ్లూరి

బుగ్గారం(ధర్మపురి): ధర్మపురి శ్రీలక్ష్మీ నరసింహస్వామిని బుధవారం డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దర్శించుకున్నారు. ముందుగా ప్రధానాలయంలోని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అనుబంధ ఆలయాలైన ఉగ్ర నరసింహుడిని, వేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆశీర్వచన మండపంలో ఆలయ అర్చకులు అడ్లూరికి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు సుముఖ్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

నింబధన ప్రకారమే స్టోన్ క్రషర్ నిర్వహణ

తంగళ్లపల్లి: ప్రభుత్వ నిబంధనల ప్రకారమే శాంభవి స్టోన్ క్రషర్ నిర్వహిస్తున్నట్లు మైనింగ్ ఏడీ సైదులు పేర్కొన్నారు. ఈనెల 16న స్టోన్ క్రషర్ మూసివేయాలి అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో బుధవారం మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు తనిఖీలు చేపట్టారు. శాంభవి స్టోన్ క్రషర్ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నిర్వహిస్తున్నట్లు మైనింగ్ ఏడీ సైదులు తెలిపారు. అన్నిశాఖల అనుమతులు ఉన్నట్లు ఆయన తెలిపారు.

పుట్టగొడుగుల్లా ఆస్పత్రులు

- చిన్న చిన్న అద్దె భవనాల్లో ప్రైవేట్ హాస్పిటళ్లు
- నిబంధనలు బేఖాతర్
- రోగులనుంచి ఇష్టానుసారంగా వసూళ్లు
- పట్టించుకోని వైద్యాధికారులు



అశోక్‌నగర్‌లో వెలిసిన ఆస్పత్రులు

జగిత్యాల: జిల్లాలో వైద్యం వ్యాపారంగా మారుతోంది. చిన్న చిన్న గదుల్లో ఎక్కబడితే అక్కడ ఆస్పత్రులు ఏర్పాటు చేస్తున్నా వైద్యశాఖ పట్టించుకోవడం లేదు. జిల్లాలో సుమారు 170 వరకు ఆస్పత్రులున్నాయి. కానీ కనీస నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. దీంతో రోగులకు సరైన వైద్యం అందడం లేదని, డబ్బులు మాత్రం ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. జిల్లా వైద్యశాఖ అధికారులు మాత్రం కనీసం నిబంధనలు పాటించని ఆస్పత్రులపై చర్యలు తీసుకోవడం లేదు. జిల్లాలో ఇటీవల కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు చిన్న ఇరుకైన గదులను ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నారు. మెట్లు లేకపోవడం, రోగులు పైకి వెళ్లేందుకు చిన్నచిన్న ర్యాంపులు సైతం లేని భవనాల్లో సైతం వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగినా పట్టించుకునే నాథుడు లేడు.

నిబంధనలు హుష్‌కాక్

జిల్లా కేంద్రంలోని ఆస్పత్రుల్లో నిబంధనలు పాటించడం లేదన్న ఆరోపణలున్నాయి. నర్సింగ్ హోమ్‌లు, ఐసీయూలు ఉంటే సరిపడా బెడ్లు సైతం ఉండాలి. కానీ ఈ నిబంధనలు ఎవరూ పాటించకపోవడంతో పాటు ఫైర్‌సేఫ్టీ సైతం ఎవరూ పట్టించుకోవడం లేదు. ఏదైనా ప్రమాదం చోటు చేసుకుంటే మంటలార్పేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు ఉండాలి. ఆస్పత్రి భవనంపై నిర్ణీత సామర్థ్యం గల నీటి ట్యాంకులతో పాటు దానికి సంబంధించిన వాటర్ పైప్‌లైన్, వార్డులు, గదులకు ఉండాలి. కానీ ఈ నిబంధన ఎక్కడా కనిపించడం లేదు. ఆస్పత్రి చుట్టూ అగ్నిమాపక యంత్రం తిరిగేలా అనువైన స్థలం ఉండాలి. ముఖ్యంగా నర్సింగ్ హోమ్‌లలో ప్రసవాలు జరుగుతుంటాయి. ఇందులో తప్పనిసరిగా ఫైర్‌సేఫ్టీ ఉండాల్సి ఉంటుంది. కానీ ఇవేమీ పట్టకుండానే చిన్నచిన్న ఇరుకైన గదులను అద్దెకు తీసుకొని ఆస్పత్రులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి హాస్పిటల్‌లో మెట్లు విశాలంగా ఉండటంతో పాటు ర్యాంపులు సైతం ఉండాలి. రోగులను స్ట్రెచ్చర్స్‌పై తీసుకెళ్లేందుకు వీలుగా ర్యాంపు లుండాలి.

కనిపించని బోర్డులు

ప్రతి ఆస్పత్రిలో వైద్యుల వివరాలు, వారి అర్హతలు, ఇతర సిబ్బంది వివరాలు, ఎలాంటి వైద్యం అందుబాటులో ఉంది. ఫీజుల వివరాలు ఉండాలి. కానీ కొన్ని ఆస్పత్రుల్లో మాత్రమే ఇవి కనిపిస్తాయి. సిబ్బందికి వేతన చట్టం ప్రకారం వేతనాలు చెల్లించడం లేదనే ఆరోపణలున్నాయి. దీనిపై వీరు కార్మిక శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఎక్కడా అది మచ్చుకైనా కనిపించడం లేదు.

జనరేటర్లు ఎక్కడ.?

కొందరు జనరేటర్లను ఏర్పాటు చేయడం లేదు. ఏర్పాటు చేసినా రోడ్లపైనసే పెడుతున్నారు. ఈ ఆటోమెటిక్ జనరేటర్లు రోడ్లపై కాకుండా ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఆస్పత్రుల్లోనే ఏర్పాటు చేసుకునేలా ఉండాలి. కానీ ప్రతి ఆస్పత్రిలో రోడ్లపైనే ఈ జనరేటర్లను ఏర్పాటు చేస్తున్నారు.

ఓపెనింగ్‌లకు ప్రజాప్రతినిధులు

ప్రారంభోత్సవాలకు మంత్రులు, ఎమ్మెల్యేలను పిలుస్తూ రిబ్బన్ కట్ చేయిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఆస్పత్రిని ఏర్పాటు చేసినప్పుడు అనుమతి తీసుకున్నారా, అన్ని నిబంధనలతో ఏర్పాటు చేశారా, వైద్యుల వివరాలు తెలుసుకున్న అనంతరం ప్రజాప్రతినిధులు ఓపెనింగ్ చేయాలి. కానీ ఇవన్నీ పట్టించుకోకుండానే ఆస్పత్రులను ఓపెనింగ్ చేస్తున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌లో నూతనంగా ఓ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. అయితే దీనికి అనుమతి లేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు వచ్చి ఓపెన్ చేశారు. అనంతరం వైద్యశాఖ నుంచి ఆదేశాలు వచ్చిన అనంతరం అనుమతి తీసుకున్నారు.

తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి



కొత్తగా ఆస్పత్రులు ఏర్పాటు చేసినప్పుడు సంబంధిత వైద్యుడు ఎవరు, ఏం ఆస్పత్రి చేస్తున్నారో దానికి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇతరులు ఆస్పత్రులు ఏర్పాటు చేసినప్పుడు వైద్యులు మారితే మళ్లీ అనుమతి తీసుకోవాలి.

పుప్పాల శ్రీధర్, డీఎంహెచ్‌వో

తరచూ డాక్టర్లు మారే

ఒక ఆస్పత్రిని ఏర్పాటు చేసినప్పుడు సంబంధిత డాక్టర్ ఎవరు, ఏ ఆస్పత్రి, నర్సింగ్ హోమ్ లేదా జనరల్ ఆస్పత్రి, మల్టీకేర్ వైద్యశాఖకు తెలపాల్సి ఉంటుంది. అయితే కొందరు వైద్యాన్ని వ్యాపారం చేస్తూ ఎక్కడికెళ్లో డాక్టర్లను తీసుకువచ్చి ఆస్పత్రులను నెల కొల్పుతున్నారు. ఒకసారి న్యూరోసర్జన్ అని, మరోసారి ఫిజిషియన్ అంటూ ఆస్పత్రిలో డాక్టర్లను మార్చుతున్నారు. ఏదైనా ఆస్పత్రిలో డాక్టర్ మారినప్పుడు వెంటనే వైద్యశాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. ఇవేమీ పట్టించుకోవడం లేదు.

కనిపించని పార్కింగ్.

జగిత్యాలలో ఏ ఆస్పత్రిలోనూ పార్కింగ్ సౌకర్యం లేదు. రోడ్లపైనే వాహనాలు ఆపుతుంటారు. జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్, జంబిగద్దె, గొల్లపల్లిరోడ్, మహాలక్ష్మీ నగర్ తదితర ప్రాంతాల్లో ఎక్కువగా ఆస్పత్రులున్నాయి. ఏ ఆస్పత్రిలోనూ పార్కింగ్ ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. ఆస్పత్రికి పేషెంట్లను తీసుకువస్తే రోడ్లన్నీ బ్లాక్ కావాల్సిందే. అధికారులు పట్టించుకోవడం లేదు.

బీరప్ప ఆలయంలో మంత్రి పూజలు



బీరప్ప ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి ఈశ్వర్

పెగడపల్లి: మండలంలోని బతికపల్లిలో ఐదు రోజులుగా బీరప్ప ఉత్సవాలు కొనసాగుతున్నాయి. భాగంగా బుధవారం బీరప్ప ఆలయం వద్ద నాగెల్లి పట్నం వేసి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ బీరప్ప ఆలయంలో స్వామివారినికి దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శోభారాణి, జెడ్పీటీసీ రాజేందర్ రావు, సింగిల్‌విండో చైర్మన్లు రమణారావు, భాస్కర్ రెడ్డి, వేణుగోపాల్, ఆర్బీఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తిరుపతి, నారాణయ, మల్లారెడ్డి, సురేందర్ రెడ్డి, రాజయ్య, గంగాధర్, తదితరులు, మంత్రి వెంట ఉన్నారు.

ప్రత్యేక పూజలు..

గొల్లపల్లి: మండలంలోని శంకర్‌రావుపేట గ్రామంలో బుధవారం పోశమ్మ తల్లి బోనాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సన్మానించారు.

నిరుద్యోగ దీక్షలో పాల్గొన్న చెదల సత్తన్న

కోరుట్ల : హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బుధవారం చేపట్టిన నిరుద్యోగ దీక్షలో చెదల సత్యనారాయణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగుల పక్షాన పోరాడుతున్న పార్టీ వైఎస్సార్‌టీపీ ఒక్కటేనన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సమస్యలపై ప్రజల పక్షాన పోరాటాలు చేస్తామన్నారు.

టేకు కలప పట్టివేత

- రూ.50 వేల విలువ గల టేకు కలప స్వాధీనం



పట్టుకున్న టేకు కలపతో అటవీశాఖ అధికారులు

చందుర్తి (వేములవాడ) : మండల శివారులోని అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను బుధవారం అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. స్థానికులు, అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో హోటల్ నిర్వహిస్తున్న ఓ వ్యక్తి అటవీ ప్రాంతంలో టేకు కలపను కూలీలతో నరికి వేయించాడు. ఆ కలపను మండలకేంద్రానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి సోదరుడి ట్రాక్టర్‌లో చందుర్తికి తరలిస్తుండగా సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు కలపను పట్టుకున్నారు. అటవీశాఖ అధికారుల నుంచి ట్రాక్టర్‌ను, కలపను విడిపించేందుకు పైరవీలు చేసినప్పటికీ ఫలించలేదు. ట్రాక్టర్‌తో పాటు కలపను సిరిసిల్ల అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. పట్టుకున్న టేకు కలప విలువ రూ.50 వేలకు పైగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. అటవీశాఖ అధికారులు మాత్రం విలువ చెప్పేందుకు నిరాకరించారు. వీరిలో సెక్షన్ అధికారిణి విజయ, బీట్ అధికారి బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మరో యువతితో రెండో పెళ్లికి యత్నం

- భర్త ఇంటి ముందు బైఠాయించిన భార్య
- పరారీలో భర్త, బంధువులు
- సఖి సెంటర్‌కు తరలించిన పోలీసులు

కోనరావుపేట(వేములవాడ): ఒకరిని ప్రేమించి పెళ్లి చేసుకుని, మరొకరితో రెండో వివాహానికి సిద్ధమైన విషయం తెలుసుకున్న సదరు వివాహిత భర్త ఇంటి ముందు ఆందోళనకు దిగింది. ఈ సంఘటన కోనరావుపేట మండలంలోని నిజామాబాద్‌లో బుధవారం జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన దోసల లత, కోనరావుపేట మండలం నిజామాబాద్‌కు చెందిన సుదమల్ల ప్రవీణ్ గత ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లికి పెద్దలు అభ్యంతరం తెలపడంతో 2021 అక్టోబర్ 7న గంభీరావుపేటలోని మానేరు చర్చిలో పెళ్లి చేసుకున్నారు. తర్వాత హైదరాబాద్‌లో కొన్ని నెలలు కలిసి ఉన్నారు. రెండు నెలల క్రితం లతను ఇంటి వద్ద దింపేసి ఇంట్లో వాళ్లని ఒప్పిస్తానని చెప్పి నిజామాబాద్‌లోని తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. అప్పటి నుంచి ఫోన్ చేయడం కూడా మానేశాడు. ప్రవీణ్‌కు వేరే సంబంధాలు చూస్తున్నారని తెలిసిన లత కొన్ని రోజుల క్రితం నిజామాబాద్‌కు రాగా భర్త కుటుంబ సభ్యులు దాడిచేసి వెళ్లగొట్టారు. ఈ విషయమై గంభీరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం గ్రామంలో పంచాయితీ నిర్వహించగా ప్రవీణ్ రాలేదు. దీంతో తన భర్త వచ్చే వరకు ఇక్కడే ఉంటానంటూ ఇంటి ముందు బైఠాయించింది. కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లారు. ప్రవీణ్ పరారీలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు బుధవారం గ్రామానికి వచ్చి లతను సిరిసిల్లలోని సఖీ సెంటర్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సిరికొండ : నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని హుస్సేన్‌నగర్ గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన డప్పు రాములు (50) మృతి చెందాడు. రాములు బంధువైన జలందర్‌తో కలిసి బైక్‌పై మండలంలోని గడ్కోల్‌కు బంధువుల ఇంటికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. వెనుక కూర్చున్న రాములుకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న జలందర్‌కు గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో సిరిసిల్లలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నర్సింలు తెలిపారు.

సెల్‌ఫోన్ పోతే ఫిర్యాదు చేయాలి



బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న సీఐ ఆరీఫ్ అలీఖాన్

జగిత్యాల క్రైం: ఎవరివైనా సెల్‌ఫోన్లు చోరీ అయినా, పోయినా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో చోరీకి గురైన ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అప్పగించారు. ఎవరి ఫోన్ అయినా దొంగతనానికి గురైతే వెతికి పట్టుకునేందుకు సీఈఐఆర్ అప్లికేషన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



లింగు ఆనందం (ఫైల్)

కోనరావుపేట (వేములవాడ) : మండలంలోని మరిమడ్ల-వట్టిమల్ల గ్రామాల మధ్య అజ్మీరాతండా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నిజామాబాద్ జిల్లావాసి మృతిచెందాడు. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం.. తాటిపెల్లికి చెందిన లింగు ఆనందం మండలంలోని వట్టిమల్లలో బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వచ్చాడు. ద్విచక్రవాహనంపై తిరిగి వెళ్తుండగా భుక్యారెడ్డి తండా దాటిన తర్వాత క్రాసింగ్ వద్ద సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో లింగు ఆనందం అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య దేవేంద్ర, కుమారులు ప్రభాకర్, మల్లేశ్, కూతురు మమత ఉన్నారు.

'రైతులను పట్టించుకోని ప్రభుత్వం'



మాట్లాడుతున్న నారాయణ

జగిత్యాల: అకాలవర్షాలతో రైతులు పంటలు నష్టపోయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జిల్లా బహుజన సమాజ్ పార్టీ ఇన్‌చార్జి మద్దెల నారాయణ ఆరోపించారు. బుధవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద, దళిత, బడుగు, నిరుద్యోగ యువతపై నిర్లక్ష్యం చూపుతోందన్నారు. హైదరాబాద్‌లో మే 7న తెలంగాణ భరోసా భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా మాయవతి హాజరుకానున్నారన్నారు. రుణమాఫీ, మూడెకరాల భూమి, నిరుద్యోగులకు ఉద్యోగాలేవని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు విజయ్‌కుమార్, గంగాధర్, ప్రవీణ్‌కుమార్, దేవ్‌సింగ్ రాథోడ్, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

రైస్‌మిల్లులో తనిఖీలు



తనిఖీలు చేపడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం.. కల్లెడ గ్రామ శివారులోని శ్రీ ఆంజనేయ రైస్‌మిల్లులో బుధవారం సాయంత్రం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు అనిల్‌కుమార్, వరుణ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. రైస్‌మిల్లులోని 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పౌర సరఫరాల శాఖ అధికారికి అప్పగించారు. స్వాధీనం చేసుకున్న బియ్యం శాంపిల్స్‌ను హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దార్ దినేశ్ చంద్ర, ఎస్సై నారాయణ బాబు, హెడ్ కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి, జగిత్యాల డీటీసీఎస్ వరప్రసాద్ పాల్గొన్నారు.

వ్యాపారి అదృశ్యం



మనోహర్‌రావు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన రైస్‌మిల్లు వ్యాపారి తక్కళ్లపల్లి మనోహర్‌రావు అదృశ్యమైనట్లు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.మనోహర్‌రావు మంగళవారం ఉదయం వాకింగ్ కోసం వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు న మోదు చేసినట్లుపట్టణ సీఐ రాంచందర్ రావు తెలిపారు.

కొల్వాయిలో ట్రాక్టర్ సీజ్

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామ శివారుల్లోని అటవీప్రాంతంలో భూములను చదును చేస్తున్న ట్రాక్టర్‌కు అధికారులు బుధవారం సీజ్ చేశారు. అటవీ భూములను ట్రాక్టర్‌తో చదును చేస్తూ, సేద్యానికి అనుకూలంగా మార్చుతున్నారనే సమాచారంతో దాడిచేశారు. ఈమేరకు ట్రాక్టర్‌ను సీజ్‌చేసి, కేసు నమోదు చేసినట్లు ధర్మపురి ఎఫ్ఆర్‌వో శ్రీనాథ్ తెలిపారు.

ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టులో ప్రమాదం

- బాయిలర్ పై నుంచి పడి అధికారి మృతి
- విచారణ చేస్తున్న ఎన్టీపీసీ పోలీసులు



జశ్వంత్ హెచ్ ఫర్‌మార్ (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్

జ్యోతినగర్(రామగుండం): పెద్దపల్లి జిల్లాలోని ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తున్న అధికారి జశ్వంత్ హెచ్ ఫర్‌మార్(57) ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందారు. తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు స్టేజీ-1లో నిర్మితమవుతున్న 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల యూనిట్-2లోని బాయిలర్ వద్ద రెండోషిఫ్టు విధులు నిర్వహిస్తుండగా జశ్వంత్ ప్రమాదవశాత్తు 30 మీటర్ల ఎత్తు నుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని ధన్వంతరి ఆస్పత్రికి తరలించగా.. చికిత్స అందించేలోపే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. జశ్వంత్ గుజరాత్‌లోని గ్యాస్ ప్రాజెక్టు నుంచి ఇటీవల ఎగ్జిక్యూటివ్ పదోన్నతిపై ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టులో విధుల్లో చేరారు. ఆస్పత్రిలోని మృతదేహాన్ని ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్ పరిశీలించి విచారణ చేపట్టారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునిల్‌కుమార్, ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య వర్ష, కుమారుడు వాసు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై జీవన్ వెల్లడించారు.

'సాగర్ మృతికి కారణమైన వారిని అరెస్టు చేయాలి'



అంబేడ్కర్ సంఘాలు, ప్రజాసంఘాల నిరసన ర్యాలీ

కథలాపూర్ (వేములవాడ): మండలంలోని తక్కళ్లపెల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు, ట్రాక్టర్ డ్రైవర్ బొడ్డు సాగర్ మృతికి కారణమైన వారిని అరెస్టు చేయాలని అంబేద్కర్ సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈనెల 9న సాగర్ తక్కళ్లపెల్లి శివారులో వరదకాలువ పక్కన అనుమానాస్పద స్థితిలో మృతిచెందితే అధికారులు ఇప్పటికీ విచారణ చేపట్టలేదన్నారు. కోరుట్ల, మెట్‌పల్లి డివిజన్ పరిధిలోని అంబేద్కర్ సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు, సభ్యులు కథలాపూర్ బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. సాగర్ మృతికి కారకులను అరెస్టు చేయాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించిన అనంతరం ర్యాలీగా వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సామాజిక తెలంగాణ ధూం ధాం రాష్ట్ర కన్వీనర్ మారంపెల్లి రవీందర్, ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్, కార్మిక సంఘం రాష్ట్ర నేత చెన్న విశ్వనాథం, బూరం అభినవ్, పొడేటి పాల్, బొడ్డు నరేశ్, తెడ్డు శేఖర్, మొలిగె శ్రీనివాస్, కోట శంకర్, బత్తుల నరేశ్, బాలె నీలకంఠం, కాశవత్తుల లక్ష్మీరాజం, కలిగోట రాజయ్య, పాలెపు బలరాం, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి : అకాలవర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పెగడపల్లి, బతికపల్లి గ్రామాల్లో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చినా కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం బాధ్యత వహించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వ్యవసాయ అధికారులు పంటనష్టాన్ని సర్వేచేసి ప్రభుత్వానికి నివేదించాలని సూచించారు. నష్టపోయిన బాధిత రైతులకు వరి ఎకరాకు రూ.15 వేలు, మామిడి రైతులకు ఎకరాకు రూ. 40 వేలు నష్ట పరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాములుగౌడ్, బతికపల్లి సర్పంచి శోభారాణి, నాయకులు మల్లారెడ్డి, రాజు, విజయ్‌భాస్కర్, సుధీర్, మల్లేశం, ప్రవీన్, తిరుపతి, అంజి నాయక్, మల్లయ్య, గంగయ్య, ఓదెలు, తదితరులున్నారు.

నిరుపేద యువతి వివాహానికి ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన నిమ్మల అశోక్ కూతురు వివాహానికి గౌడసంఘం జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్ బుధవారం రూ.61,116 ఆర్థిక సాయం అందించారు. గోవర్ధన్‌గౌడ్ వితరణ చేసిన డబ్బులను లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వంగల రవీందర్ చేతుల మీదుగా అందజేశారు. తన కూతురు వివాహానికి చేయూతనందించిన గోవర్ధన్‌గౌడ్‌కు అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. లయన్స్ క్లబ్ సెక్రెటరీ రామచంద్రం, జోన్ చైర్మన్ నంది కిషన్, గొర్రె మల్లేశం, పెంజర్ల రవి ఉన్నారు.